TELANGANA CAPITAL

# తెలంగాణ క్యాపిటల్

నిజం.. నిజాయితీ.. నిబద్ధత

TELANGANA CAPITAL NEWS

www.telanganacapitalnews.com

హైదరాబాద్ | సంపుటి : 1 సంచిక: 125 | మంగళవారం, సెప్టెంబర్ 10, 2024 | కంప్లిమెంటరీ కాపీ | పేజీలు : 4

## చేనేత కార్మికులను...

# రుణ విముక్తులను చేస్తాం

## : సిఎం రేవంత్



హైదరాబాద్: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం చేనేత అభయహస్తం లోగో ఆవిష్కరించారు. నేతన్నకు చేయూత పథకం కింద రూ.290 కోట్ల నిధులు విడుదల చేస్తున్నట్లు సిఎం రేవంత్ చెప్పారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ మాట్లాడుతూ.. దాదాపు రూ.30 కోట్ల చేనేత రుణాలు మాఫీ చేసి.. చేనేత కార్మికులను రుణ విముక్తులను చేస్తామన్నారు. "రైతన్న ఎంత ముఖ్యమో.. మాకు నేతన్న కూడా అంతే ముఖ్యం. మీ సమస్యల పరిష్కారానికి మీ అన్నగా మీకు అండగా ఉంటా. ఎలక్షన్, సెలెక్షన్, కలెక్షన్ చేసిన వారిది త్యాగం కాదు.. తెలంగాణ కోసం పదవిని తృణప్రాయంగా వదిలేసిన కొండా లక్ష్మణ్ బాపూజీది అసలు సిసలైన త్యాగం. త్యాగానికి మారుపేరు కొండా లక్ష్మణ్ బాపూజీ.. IIHTకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలని నిర్ణయించాం" అని తెలిపారు.

## అనర్హత ఎమ్మెల్యే సంగతి...

# నాలుగు వారాలలో తేల్చండి

## : హైకోర్టు

హైదరాబాద్: బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలకు ఎదురుదెబ్బ తగిలింది. అనర్హతపై నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని అసెంబ్లీ సెక్రెటరీకి హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. అనర్హత పిటిషన్లను స్పీకర్ ముందుంచాలని స్పష్టం చేసింది. నాలుగు వారాల్లోగా స్టేటస్ రిపోర్ట్ సమర్పించాలని ఆదేశించింది. గడువులోపు ఎలాంటి నిర్ణయం తీసుకోనట్లయితే సుమోటోగా మరోసారి విచారణ చేస్తామని తెలిపింది. ఈ మేరకు హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలపై స్పీకర్ అనర్హత వేటు వేసేలా అసెంబ్లీ కార్యదర్శికి ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ, ఇతరులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై ఇరుపక్షాల వాదనలు గత నెల 7న పూర్తయ్యాయి. నేడు తీర్పును వెలువరిస్తూ పిటిషన్ల విచారణపై షెడ్యూల్ రిలీజ్ చేయాలని స్పీకర్‌ను ఆదేశించింది. నోటీసులు ఎప్పుడు ఇస్తారు, విచారణ ఎప్పుడు జరుపుతారు, ఎప్పటివరకు వాదనలు వినాలి, ఎప్పటిలోగా ప్రొసీడింగ్స్ పూర్తి చేయాలనే విషయాలను ప్రకటించాలని తెలిపింది. నాలుగు వారాల్లోగా షెడ్యూల్ విడుదల చేయకపోతే సుమోటోగా విచారణ జరుపుతామని స్పష్టం చేసింది. ఇది ఇలా ఉంటే గత ఏప్రిల్ 24న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు లోతుగా విచారించింది. బీఆర్ఎస్ తరఫున గెలిచి, కాంగ్రెస్ పార్టీలో చేరిన కడియం శ్రీహరి (స్టేషన్‌ఘన్‌పూర్), దానం నాగేందర్ (ఖైరతాబాద్), తెల్లం వెంకట్రావు (భద్రాచలం)పై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద పిటిషన దాఖలు చేయగా, దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలంటూ బీజేపీ శాసనసభాపక్ష నేత మహేశ్వర్‌రెడ్డి మరొకరు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు నేడు తీర్పువెలువరించింది.

# హైదరాబాద్ సిపిగా బాధ్యతలు చేపట్టిన సివి ఆనంద్



హైదరాబాద్: హైదరాబాద్ పోలీస్ కమిషనర్ గా సీవీ ఆనంద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండోసారి సీపీగా బాధ్యతలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. "రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ పై సీరియస్ గా ఉంది. గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేస్తా. ఫ్రెండ్లీ పోలీసింగ్ అనేది.. పార్ట్ ఆఫ్ పోలీసింగ్. క్రిమినల్స్ పై ఉక్కుపాదం మోపుతాం. లా అండ్ ఆర్డర్‌పై కఠినంగా వ్యవహరిస్తాం. హైదరాబాద్‌లో వినాయక నిమజ్జనం అనేది కీలకం. ప్రశాంతంగా వినాయక నిమజ్జనం అయ్యేలా చర్యలు తీసుకుంటాం" అని చెప్పారు. కాగా.. 1991 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సీవీ ఆనంద్.. 2017లో అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసుగా పదోన్నతిపై ఆయన కేంద్ర సర్వీసులకు వెళ్లారు. అనంతరం 2021లో తిరిగొచ్చిన ఆయన 2021 డిసెంబర్ నుంచి 2023 అక్టోబర్ వరకూ హైదరాబాద్ సీపీగా పని చేశారు. ఆ తర్వాత డీజీపీ హోదా కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే.. 2023 ఎన్నికల సమయంలో ఆయనను సీపీ పదవి నుంచి తప్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆనంద్‌కు ఏసీబీ డీజీగా బాధ్యతలు అప్పగించింది. ప్రస్తుతం తిరిగి హైదరాబాద్ సీపీగా సీవీ ఆనంద్ నియమించింది.

## ఎంఎల్‌ఏల వేటుపై తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌కు...

# నెల గడువు విధించిన హైకోర్టు

హైదరాబాద్: ఇతర పార్టీల్లోకి ఫిరాయించిన ఎంఎల్‌ఏ లపై నిర్ణయం తీసుకునేందుకు తెలంగాణ స్పీకర్‌కు తెలంగాణ హైకోర్టు సెప్టెంబర్ 9వ తేదీ సోమవారం నాడు నాలుగు వారాల గడువు ఇచ్చింది. బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి మారిన ఎంఎల్‌ఏ లపై అనర్హత వేటు వేయడంలో తెలంగాణ శాసనసభ స్పీకర్ చర్యలు తీసుకోకపోవడంపై బిఆర్ఎస్, బిజెపి ఎంఎల్‌ఏ లు వేసిన మూడు పిటిషన్‌లపై విచారణ సందర్భంగా హైకోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ఖైరతాబాద్ ఎంఎల్‌ఏ దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేసేలా స్పీకర్‌ను ఆదేశించాలని కోరుతూ బిజెపి నిర్మల్ ఎంఎల్‌ఏ ఆలేటి మహేశ్వర్‌రెడ్డి, హుజూరాబాద్ బిఆర్ఎస్ ఎంఎల్‌ఏ పాడి కౌశిక్ రెడ్డి పిటిషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్‌లోకి పార్టీ ఫిరాయించిన బిఆర్ఎస్ మాజీ ఎంఎల్‌ఏ లు, భద్రాద్రి కొత్తగూడెం ఎంఎల్‌ఏ వెంకటరావు తెల్లం, ఘన్‌పూర్ (ఎస్సీ రిజర్వ్ డ్) ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై అనర్హత వేటు వేయాలని కోరుతూ కూన పాండు వివేకానంద పిటిషన్ దాఖలు చేశారు.

# వరద బాధితులను ఆదుకోవడంలో సాయం చేయండి : సీఎం రేవంత్

హైదరాబాద్: తెలంగాణ వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా నిలబడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ కంపెనీలు, ఇతర రంగాల్లోని ప్రముఖులు స్పందించాలని కోరారు. "వరద బాధితులను ఆదుకోవడానికి చేతనైనంత సహాయాన్ని అందించండి. మానవత్వం ప్రదర్శించాల్సిన సమయమిది" అని రేవంత్ రెడ్డి అన్నారు. ఈ మేరకు తెలంగాణ సీఎంఓ ఎక్స్ వేదికగి... క్యూఆర్ కోడ్ ఒక పోస్ట్ చేసింది. తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళాలను చెక్కుల రూపంలో లేదా ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఆన్‌లైన్ బ్యాంకింగ్, యూపీఐ పేమెంట్ యాప్స్ ద్వారా పంపవచ్చు అన స్పష్టం చేసింది. ఇక కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ సీఎస్ఆర్ కింద విరాళాలు అందించే సంస్థలు కింద ఇచ్చిన రెండో క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లింపులు జరపవచ్చని పేర్కొంది.

# నిరసనల వెనుక కేంద్రం కుట్ర : మమతా బెనర్జీ



కోలకతా: ఆర్‌జి కార్ ఆసుపత్రిలో గత నెల ఒక ట్రెయినీ డాక్టర్ హత్యాచార ఘటనపై ప్రజల ఆందోళన వెనుక కేంద్ర ప్రభుత్వ కుట్ర దాగి ఉందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సోమవారం ఆరోపించారు. ఈ కుట్రలో కొన్ని వామపక్షాల ప్రమేయం కూడా ఉందని ఆమె ఆరోపించారు. రాష్ట్ర సచివాలయంలో నబన్నలో ఒక పాలనాపర సమీక్షా సమావేశంలో మమతా బెనర్జీ మాట్లాడుతూ మృతురాలి తల్లిదండ్రులకు తాను డబ్బు ఇవ్వచూపినట్లు చేస్తున్న ప్రచారంలో ఎటువంటి వాస్తవం లేదని స్పష్టం చేశారు. మరణించిన ట్రెయినీ డాక్టర్ కుటుంబ సభ్యులకు తాను ఎన్నడూ డబ్బు ఇస్తానని చెప్పలేదని ఆమె తెలిపారు. ఇది కేవలం దుష్ప్రచారం మాత్రమేనని ఆమె స్పష్టం చేశారు. తమ కుమార్తె స్మృత్యర్థం ఏదైనా చేయాలని మీరు ఆశిస్తే దానికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందని మాత్రమే తాను వారికి చెప్పానని ఆమె వివరించారు. ఎప్పుడు ఏం మాట్లాడాలో తనకు తెలుసునని కూడా ఆమె వ్యాఖ్యానించారు. ఆర్‌జి కార్ ఆసుపత్రి ఘటన అనంతరం జరుగుతున్న నిరసన కచ్చితంగా కేంద్రం పన్నిన కుట్రేనని, ఇందులో కొన్ని వామపక్షాలకు కూడా భాగస్వామ్యం ఉందని మమత ఆరోపించారు.

## గ్రీన్ ఫార్మా సిటీ అభివృద్ధిపై...

# సీఎం సమీక్ష



హైదరాబాద్ శివారులోని ముచ్చెర్లలో గ్రీన్ ఫార్మా సిటీ అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో సీఎంతో పాటు పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, సీఎస్ శాంతికుమారి గ్రీన్ ఫార్మా సిటీ ప్రణాళికలపై సుదీర్ఘంగా చర్చించారు. కాగా, ఔషధాల తయారీ కంపెనీలు, బయోటెక్ అండ్ లైఫ్ సైన్సెస్ కంపెనీలకు కొత్తగా నెలకొల్పే అత్యాధునిక గ్రీన్ ఫార్మా సిటీ సింగిల్ స్టాప్‌గా ఉండాలని అభిప్రాయపడ్డారు. గ్రీన్ ఫార్మా సిటీ అభివృద్ధిని వేగవంతం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గ్రీన్ ఫార్మా సిటీని పూర్తిగా కాలుష్య రహితంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్లు, ఇతర మౌలిక వసతుల కల్పన ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అందుబాటులోకి వచ్చిన కొత్త టెక్నాలజీని వినియోగించుకోవాలని అన్నారు. పరిసర ప్రాంతాల ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరిశ్రమల అభివృద్ధి జరగాలన్నారు. గ్రీన్ ఫార్మా సిటీలో పెట్టుబడులు పెట్టేందుకు ఇప్పటికే పలు ఫార్మా కంపెనీలు ముందుకు వస్తున్నాయని, త్వరలోనే ఆయా కంపెనీలతో టచ్‌లో ఉంటామని సీఎం చెప్పారు.

## బాసర ఆర్జీయూకేటీలో విద్యార్థులతో...

# సమ్మె విరమణ

**బాసర:** నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీ విద్యార్థులు తమ ఆందోళనకు విరమించారు. తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ ఫర్ సాలిడారిటీ (టీఎస్ ఏఎస్) పేరుతో ఏర్పాటైన విద్యార్థుల సంఘం తమ సమస్యల పరిష్కారం కోసం గత నాలుగు రోజులుగా నిరసన చేపట్టింది.




ఈ మేరకు ఆర్జీయూకేటీ వైస్ ఛాన్సలర్ విద్యార్థులతో చర్చలు జరిపి నిర్ణీత గడువులోగా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వాగ్దానాల కాపీని వీసీ తమకు ఇచ్చారని విద్యార్థులు తెలిపారు. ఆ హామీలు నెరవేరుస్తారనే నమ్మకంతో ప్రస్తుతం సమ్మె విరమణ చేస్తున్నామని విద్యార్థులు తెలిపారు.



# తెలంగాణలో దేశంలోనే అతిపెద్ద వినాయకుడి విగ్రహం

**నాగర్ కర్నూల్:** దేశంలోనే అతిపెద్ద వినాయకుడి విగ్రహం తెలంగాణ రాష్ట్రంలో ఉంది. నాగర్ కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం అవంఛలో ఈ గణేషుడి విగ్రహం ఉంది. ఇది దేశంలోనే అత్యంత పురాతన ఏకశిలాతో చేసిన గణపతిగా పేరుంది. ఈ గణేషుడి విగ్రహం 9వ శతాబ్దానికి చెందినదిగా చరిత్రకారులు చెబుతున్నారు. విగ్రహం ఎత్తు 30 అడుగులు కాగా వెడెల్పు 15 అడుగులు. కొత్త తెలంగాణ చరిత్ర బృందం అధ్యక్షుడు రామోజు హరగోపాల్ ప్రకారం సుమారు 879 ఏండ్ల కిందట అంటే క్రీ.శ 1140లో ఈ విగ్రహాన్ని తైలంపుడు అనే రాజు ఏకశిలపై చెక్కించాడు. ప్రస్తుతం కర్ణాటకలోని గుల్బర్గా జిల్లాగా పిలవబడుతున్న ప్రాంతం అప్పట్లో బాదామి రాజ్యంగా ఉండేది. మహబూబ్ నగర్ జిల్లా అవంఛ గ్రామా శివారుల్లో ఉన్న ఈ విగ్రహాన్ని చూసేందకు జనాలు గుంపులు గుంపులుగా తరలి వస్తున్నారు. ఇదిలా ఉండగా కళ్యాణ చాళుక్యుల కాలంలోనే క్రీస్తు శకం 11 శతాబ్దంలో చెక్కిన మరొక విగ్రహం సిద్దిపేట జిల్లాలోని బైరాన్ పల్లి గ్రామంలో ఉంది. ఆనాటి పాలకులు, హిందూ మతానికి, శిల్ప సౌందర్యానికి ఇచ్చిన ప్రాముఖ్యత ఈ శిల్పాల్లో కనపడుతుంది. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా వినాయకచవితి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఊరు వాడ మొత్తం గణేశుని నామస్మరణంతో మారుమోగుతోంది. లంబోధరుడిని వివిధ రూపాల్లో కొలువుతీర్చి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. గణేష్ మండపాల వద్ద విద్యుత్ కాంతుల శోభతో ప్రత్యేక కళను సంతరించుకున్నాయి. రాష్ట్రంలో ఏ గ్రామంలో చూసినా వివిధ రూపాల్లో వినాయకుని విగ్రహాలు కళకళలాడుతున్నాయి. గణేష్ మండపాల వద్దకు పెద్ద ఎత్తున చేరుకుని భక్తులు పూజలను నిర్వహిస్తున్నారు. ఈ సారి కొన్ని వినాయక విగ్రహాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

## క్యాన్సర్ ఔషధాలపై...

# జిఎస్‌టి తగ్గింపు




న్యూఢిల్లీ: క్యాన్సర్ ఔషధాలపై జిఎస్‌టి కౌన్సిల్ ఊరటనిచ్చింది. క్యాన్సర్ డ్రగ్స్‌పై ప్రస్తుతం ఉన్న 12 శాతం జిఎస్‌టి రేటు ను 5 శాతానికి తగ్గిస్తూ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. అలాగే ఆరోగ్య, జీవిత బీమా ప్రీమియం చెల్లింపులపై జిఎస్‌టి(వస్తు, సేవల పన్ను)ని తగ్గించడంపై జిఎస్‌టి కౌ న్సిల్ సమావేశంలో ఎలాంటి నిర్ణయం తీ సుకోలేదు. ప్రస్తుతం బీమా ప్రీమియంపై జిఎస్‌టి గరిష్ఠ స్థాయిలో 18 శాతం విధిస్తున్నారు. దీనికి తగ్గించాలని మంత్రుల తో పాటు పలువురు పార్లమెంట్ సభ్యులు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నారు. ఈ అంశంపై జిఎస్‌టి కౌన్సిల్ చర్చ జరిపింది. ఆరోగ్య, జీవితా బీమా ప్రీమియం పై జిఎస్‌టి తగ్గించేందుకు జిఎస్‌టి కౌ న్సిల్ ఏకగ్రీవంగా అంగీకారం తెలిపినప్పటికీ, వచ్చే సమావేశానికి నిర్ణయాన్ని వా యిదా వేశారు. ఈ విషయంలో ఊరట లభించే అవకాశముందని అధికార వర్గా లు పేర్కొంటున్నాయి. సోమవారం కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో 54వ జిఎస్‌టి కౌన్సిల్ సమావేశం జరిగింది.

ఈ సమావేశంలో ఆరోగ్య, జీవిత బీమా ప్రీమియం చెల్లింపుపై జిఎస్‌టిని తగ్గించే అంశంపై మరింత అధ్యయనం చేయాల్సి ఉందని కౌన్సిల్ భావించింది. కేంద్ర రాష్ట్ర పన్ను అధికారులతో కూడిన ఫిట్‌మెంట్ కమిటీ బీమా ప్రీమియంపై జిఎస్‌టి తగ్గిం పు వచ్చే లాభనష్టాలను భేరీజు వేయనుం ది. ఈ అంశంపై విచారణ నిమిత్తం మం త్రుల బృందానికి పంపారు. ఆరోగ్య బీమాపై జిఎస్‌టి రేటు తగ్గింపుపై అధ్యయ నం చేసేందుకు బీహార్ ఉప ముఖ్యమంత్రి అధ్యక్షతన మంత్రుల బృందం ఏర్పాటైంది. ఈ మంత్రివర్గం వచ్చే నెల చివరి నాటికి నివేదికను సిద్ధం చేయాల్సి ఉంటు ంది. 2024 నవంబర్‌లో జరిగే జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో దీనిపై మళ్లీ చర్చిం చి, ఒక నిర్ణయాన్ని ప్రకటించనున్నారు.

**తీర్థయాత్రలు చేపట్టే వారికి ఊరట**

క్యాన్సర్ ఔషధాలపై ప్రస్తుతం ఉన్న 12 శాతం జిఎస్‌టి రేటును 5 శాతానికి తగ్గి స్తూ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. అలాగే స్నాక్స్‌పై జిఎస్‌టిని 18 శాతం నుంచి 12 శాతానికి తగ్గిస్తున్నట్టు నిర్మలా సీతారామన్ తెలిపారు. జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో మతపరమైన యాత్రలు చేసే వారి కి శుభవార్త అందించారు. ఇకపై మతపరమైన తీర్థయాత్రలు చేపట్టే వారు హెలికాప్టర్ సేవలను వినియోగించుకోవడంపై 18 శాతానికి బదులుగా 5 శాతమే జిఎస్ టి చెల్లించాలని సమావేశంలో నిర్ణయించారు. ఉత్తరాఖండ్ ప్రభుత్వం డిమాండ్ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. జిఎస్‌టి పరిహార సెస్సు కొనసాగించాలా, లే దా అనే అంశంపై మంత్రివర్గానికి సిఫార సు చేస్తున్నట్టు ఆర్థికమంత్రి తెలిపారు. ఆ న్‌లైన్ గేమింగ్‌పైనా కౌన్సిల్ చర్చించింది.

## నేతన్నలకు గుడ్ న్యూస్....

# త్వరలో రుణాలు మాఫీ: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్ : నేతన్నల రూ. 30 కోట్ల రుణాలు మాఫీ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. సోమవారం నాంపల్లి లలిత కళాతోరణంలో ఐఐహెచ్ టీ(ఇండియన్ ఇన్ స్టిట్యట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ)ని వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలాది మంది నేతన్నలను కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం బతుకమ్మ చీరలకు ఆర్డర్లు ఇచ్చిందని, కానీ బకాయిలు చెల్లించలేదని గుర్తు చేశారు. తాము అధికారంలోకి వచ్చాక పెండింగ్ బకాయిలు చెల్లించి సిరిసిల్ల నేతన్నలను ఆదుకున్నామని చెప్పారు. గత ప్రభుత్వం నేతన్నలను ఆదుకోలేదని విమర్శించారు. నేతన్నలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉ ంటుందని భరోసా ఇచ్చారు.

**అంతర్జాతీయ స్థాయిలో ఐఐహెచ్‌టీకి పేరు**

అంతర్జాతీయ స్థాయిలో ఐఐహెచ్‌టీకి పేరు వచ్చేలా కృషి చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రధాని మోదీని కలిసి ఐఐహెచ్‌టీ అవసరంపై వివరించామని, రాజకీయాలకతీతంగా కేంద్రం నిధులు మంజూరు చేసిందన్నారు. ఐఐహెచ్ టీ విద్యార్థులకు నెలకు రూ. 2500 ప్రోత్సాహకం అందజేస్తామని చెప్పారు. విద్యార్థులకు నైపుణ్యాన్ని పెంపొందించేందుకు స్కిల్ వర్శిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఏటా 60 మందికి టెక్స్‌టైల్ టెక్నాలజీలో డిప్లొమా కోర్సులకు ఇస్తామన్నారు.

**చేనేత అభయహస్తం ప్రారంభం**

ఈ సందర్భంగా 'చేనేత అభయహస్తం' పథకాన్ని సీఎం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో 'నేతన్నకు చేయూత' పథకం కింద 36,133 మంది లబ్ధిదారులకు రూ. 290 కోట్ల నిధులు విడుదల చేశామన్నారు. మహిళా సంఘాల సభ్యులకు చీరల పంపిణీ ఏడాదిలో మహిళా సంఘాల సభ్యులకు రెండు క్వాలిటీ చీరలు పంపిణీ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చేనేత అభయహస్తం లోగోను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సీఎస్ శాంతికుమారి పాల్గొన్నారు.

# కాళోజీ కలం.. సామాన్యుల గళం : కేటీఆర్



హైదరాబాద్: తెలంగాణ భాష బడి పలుకుల భాష కాదు, పలుకుబడుల భాష అని ఎలుగెత్తి చాటిన మహనీయుడు కాళోజీ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా ఆ మహనీయునికి నివాళులర్పించారు. ఎక్స్ వేదికగా రాష్ట్ర ప్రజలకు తెలంగాణ భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. 'మన కాళోజీ 'గొడవ' ప్రజల గొడవ. అచ్చమైన తెలంగాణ వాడుక భాషలో కాళోజీ నారాయణరావు చేసిన రచనలు మాటల తూటాలు. నిరంకుశత్వంపై, అరాచక పాలనపై, అసమానతలపై విమర్శనాస్త్రాలు. ప్రతినిత్యం సామాన్యుల సమస్యలనే, హక్కుల పరిరక్షణే, ప్రజా శ్రేయస్సునే తన జీవితంగా భావించిన తెలంగాణ వైతాళికుడు కాళోజీ. ప్రజాకవిగా పేరొందిన కాళోజీ స్వాతంత్ర్య సమరయోధునిగా, తెలంగాణ ఉ ద్యమకారునిగా అందించిన స్ఫూర్తి, చేసిన సేవలు అనిర్వచనీయం. అన్నారు

**ధిక్కార స్వరానికి సమున్నత గౌరవం..**

మన కాళన్న గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలనే మహోన్నత ఉద్దేశంతోనే ఉద్యమ నేత, మాజీ సీఎం కేసీఆర్ కాళోజీ జయంతిని (సెప్టెంబర్ 9) తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహించారు. వైద్య విశ్వవిద్యాలయానికి వారి పేరు పెట్టారు. వరంగల్‌లో సుందరమైన కాళోజీ కళాక్షేత్రాన్ని నిర్మించారు. ధిక్కార స్వరం కాళోజీ తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణం. కాళోజీ కలం.. సామాన్యుల గళం.. ప్రజలకు బలం.' అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

# ఆమె ఫొటోలు కనిపించకూడదు!

హైదరాబాద్: కోల్‌కతా ఆర్‌జీ కర్ వైద్యురాలికి సంబంధించిన ఫొటోలు, దృశ్యాలు అన్నీ సోషల్ మీడియా ప్లాట్‌ఫాంల నుంచి వెంటనే తొలగించాలని సుప్రీం కోర్టు సోమవారం ఆదేశించిది. ఈ కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేసేందుకు కోల్‌కతా పోలీసులు ఎందుకు ఆలస్యం చేశారని మరోసారి ప్రశ్నించింది.

లైంగిక దాడి, మర్డర్ ఘటనలపై సోమవారం మరోసారి విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు ఈ మేరకు వ్యాఖ్యలు చేసింది. అలాగే నిరసన చేపడుతోన్న డాక్టర్లు వెంటనే విధుల్లో చేరాలని ఆదేశించింది. మరోవైపు కేసు దర్యాప్తుపై కొత్త నివేదికను సమర్పించాలని సీబీఐని నిర్దేశించిది.

**కొత్త నివేదికను 17లోగా ఇవ్వాలన్న ధర్మాసనం..**

ఫోరెన్సిక్ నివేదిక కోసం మృతదేహం వద్ద సేకరించిన శాంపిల్స్‌ను ఢిల్లీ ఎయిమ్స్‌కు పంపాలని అకుంటున్నట్లు సీబీఐ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీం కోర్టుకు తెలిపారు. 'ముందుగా పోలీసులు సేకరించిన శాంపిల్స్‌ను బెంగాల్‌లోని సీఎఫ్ఎస్ఎల్‌కు తరలించి పరీక్షలు చేశారు.

ఈ నివేదిక మా దగ్గర ఉంది. ఇప్పుడు ఆ నమునాలను సీబీఐ ఎయిమ్స్ పంపాలనుకుంటుంది.' అని సుప్రీం కోర్టుకు తెలిపారు. కొత్త నివేదికను సెప్టెంబర్ 17న సమర్పించాలని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం సీబీఐని ఆదేశించింది. ఈ కేసు విచారణను ఈనెల 17కు వాయిదా వేసింది.

**సిబ్బందికి అన్ని వసతులు కల్పించాలి..**

ఆర్‌జీ కర్ ఆసుపత్రి వద్ద రక్షణ కల్పిస్తోన్న సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్)కు బంగాల్ ప్రభుత్వం సహకరించడం లేదని కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది. దీనిపై స్పందించిన ధర్మాసనం సబ్బందికి అన్ని వసతులు కల్పించాలని, వారికి అవసరమైన రిక్విజిషన్‌లు, గాడ్జెట్‌లను వెంటనే అందజేయాలని బంగాల్ ప్రభుత్వాన్ని, సీఐఎస్ఎఫ్‌ని ఆదేశించింది.

**విధుల్లోకి రాకపోతే కఠిన చర్యలు**

మరోవైపు సుప్రీం కోర్టుకు బంగాల్ ఆరోగ్యశాఖ కూడా ఓ నివేదిక సమర్పించింది. రాష్ట్రంలో డాక్టర్ల నిరసనల వల్ల సకాలంలో వైద్యం అందక ఇప్పటివరకు 23 మంది ప్రాణాలు కోల్పోయారని నివేదికలో తెలిపింది. ఈ క్రమంలో స్పందించిన సుప్రీంకోర్టు మంగళవారం సాయంత్రం 5 గంటల్లోపు ఆందోళనలు చేస్తున్న డాక్టర్లు విధుల్లో చేరితే వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని స్పష్టం చేసింది. ఒక వేళ విధుల్లోకి రాకపోతే వారిపై చర్యలు తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉంటుందని తెలిపింది.

## తెలంగాణ నుంచి అరుణాచలంకు అందుబాటు ధరలో...

# టూరిజం ప్యాకేజీ!

హైదరాబాద్: తమిళనాడులో పుణ్యక్షేత్రాల్లో ఒకటైనా అరుణాచలంను సందర్శించేందుకు ఇటీవల పెద్ద ఎత్తున భక్తులు ఆసక్తి చూపిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద ఎత్తున ఆలయాన్ని సందర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ టూరిజం భక్తుల కోసం ప్రత్యేక టూరిజం ప్యాకేజీలను ఆపరేట్ చేస్తోంది. హైదరాబాద్ నుంచి అరుణాచలంకు తెలంగాణ టూరిజం 'హైదరాబాద్–అరుణాచలం' పేరుతో ఓ ప్యాకేజీని అందిస్తోంది.




హైదరాబాద్ నుంచి ఈ టూర్‌ను ఆపరేట్ చేస్తున్నారు. 3 రాత్రులు, 4 రోజుల పాటు ఈ టూర్ సాగుతుంది. ఇందులో భాగంగా అరుణాచలేశ్వర ఆలయం, కాణిపాకం, వేలూరు గోల్డెన్ టెంపుల్ కవర్ అవుతాయి. ప్రస్తుతం ఈ టూర్ ప్యాకేజీ సెప్టెంబర్ 15వ తేదీన అందుబాటులో ఉంది. ఇది తప్పితే.... అక్టోబర్‌లో మరోసారి అవకాశం కల్పించనున్నారు.

**ప్రయాణం ఇలా మొదలవుతుంది...**

- మొదటి రోజు హైదరాబాద్‌లోని బషీర్ బాగ్ నుంచి సాయంత్రం 6.30 గంటలకు ప్రయాణం మొదలవుతుంది.
- రెండో రోజు ఉదయం 6 గంటలకు కాణిపాకం చేరుకుంటారు. ఫ్రెషప్ అయిన తర్వాత ఉదయం 9 గంటల లోపు దర్శనం పూర్తి చేస్తారు. అనంతరం అక్కడి నుంచి తిరువణ్ణామలైకి బయల్దేరుతారు.
- మధ్యాహ్నం ఒంటి గంటకు అరుణాచలం చేరుకుంటారు. తర్వాత అరుణాచలేశ్వరస్వామి దర్శనం పూర్తి చేసుకుంటారు. రాత్రి అరుణాచలంలోనే బస ఉంటుంది.
- ఇక మూడో రోజు ఉదయం టిఫిన్ పూర్తి కాగానే అక్కడి నుంచి బయల్దేరి మధ్యాహ్నానికి వేలూరు బయలు దేరుతారు. సాయంత్రం దర్శనం పూర్తి అవుతుంది. వెంటనే తిరుగు ప్రయాణం మొదలవుతుంది.
- 4వ రోజు ఉదయం హైదరాబాద్‌కు చేరుకోవడంతో టూర్ ముగుస్తుంది.

**ప్యాకేజీ ధరలు ఇలా:**

ఏసీ బస్సు ప్రయాణాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ టూర్‌లో పెద్దలకు ప్యాకేజీని రూ. 8,000, పిల్లలకు రూ. 6,400గా నిర్ణయించారు. ఈ ప్యాకేజీలో బస్ జర్నీ, హోటల్స్ కవర్ అవుతాయి. ఆలయాల్లో దర్శనం టికెట్లు, భోజనానికి పర్యాటకులు స్వంతంగానే ఖర్చు భరించాల్సి ఉంటుంది.

# ఢిల్లీలో 500 స్నిపర్ రైఫిల్ తూటాలు స్వాధీనం

న్యూఢిల్లీ: పశ్చిమ ఢిల్లీ మోతీ నగర్ ప్రాంతంలో సార్వత్రిక ట్రాఫిక్ తనిఖీలో ఒక మోటార్‌సైకిల్‌పై రవాణా చేస్తున్న 500 స్నిపర్ రైఫిల్ తూటాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు సోమవారం వెల్లడించారు. ట్రాఫిక్ పోలీసులు శనివారం రాత్రి వాహనాలను తనిఖీ చేస్తున్నప్పుడు ఒక మోటార్‌సైకిల్ నడుపుతున్న వ్యక్తిని ఆగవలసిందని సూచన చేశారని. కానీ అతను వేగం పెంచి పరారీకి ప్రయత్నించాడని, దానితో అతనిని వాహనాలపై వెంటాడారని ఈ విషయంలో దర్యాప్తు గురించి తెలిసిన సీనియర్ పోలీస్ అధికారి ఒకరు తెలిపారు. వాహనాలతో వెంటాడినప్పుడు అతను ఒక ట్రాఫిక్ స్టాప్ సమీపంలో మోటార్‌సైకిల్ వదిలేసి పారిపోయాడని ఆయన చెప్పారు. పోలీసులు మోటార్‌సైకిల్‌ను తనిఖీ చేయగా ఒక సంచీ కనిపించింది. సంచీలో 7.62 కాలిబర్‌వి 500 కార్ట్రిజెస్‌తో కూడిన 10 పెట్టెలను వారు కనుగొన్నారని, ఈ విషయమై మోతీ నగర్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందజేసి, కార్ట్రిజెస్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ అధికారి వివరించారు.



## సంపాదకీయం

మంగళవారం, సెప్టెంబర్ 10, 2024

# రైతు 'పంట' పండించిన బడ్జెట్..!

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తన తొలి బడ్జెట్‌లో రైతుకు, వ్యవసాయానికి పట్టం కట్టింది. కొత్త సంక్షేమ పథకాలు ఏవీ లేవని బడ్జెట్‌పై చర్చలో కేసీఆర్ విమర్శలు గుప్పించినప్పటికీ ఇది రైతు పంట పండించనున్న బడ్జెట్‌గా చెప్పాలి.వ్యవసాయశాఖకు భారీగా రూ.72,659 కోట్లు కేటాయించగా, రూ.2లక్షల రుణమాఫీ కోసం రూ.31వేల కోట్లను అదనంగా కేటాయించారు. తొలిసారిగా రైతు కూలీలకు కూడా పట్టాలతో సంబంధం లేకుండా ఏడాదికి 12 వేల రూపాయలు ఇవ్వనున్నట్లు మంత్రి చెప్పడం ముదావహం. అలాగే రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్ నగర అభివృద్ధికి రూ.10 వేల కోట్లను కేటాయించి మంత్రి నివ్వెరపరిచారు. సంక్షేమానికి రూ.40 వేల కోట్లు కేటాయించారు. దీంతో అప్పుల చెల్లింపుతో పాటు ప్రజా ప్రయోజనాలకు కూడా భారీగా వ్యయం చేయనున్నట్లు రాష్ట్ర బడ్జెట్ పేర్కొంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను వార్షిక బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క గురువారం అసెంబ్లీలో ప్రవేశ పెట్టారు. మొత్తం బడ్జెట్ వాల్యూ 2,91,159 లక్షల కోట్లు కాగా, అందులో రెవెన్యూ వ్యయం రూ.2,20,945 కోట్లు, మూలధనం వ్యయం రూ.33,487 కోట్లుగా ఉంది. ఈ క్రమంలో వ్యవసాయశాఖకు భారీగా రూ.72,659 కోట్లు, సంక్షేమానికి రూ.40 వేల కోట్లు, సాగునీటి రంగానికి రూ.26 వేల కోట్లు కేటాయించారు. ఇవే కాకుండా పంచాయతీరాజ్ శాఖకు రూ.29, 816 కోట్లు, విద్యాశాఖకు రూ.21,292 కోట్లు, వైద్యారోగ్య శాఖకు రూ.11, 468 కోట్లు. ఎస్టీ సంక్షేమానికి రూ.17,056 కోట్లు. ఎస్సీ సంక్షేమానికి రూ. 33,124 కోట్లు, బీసీ సంక్షేమానికి రూ.9200 కోట్లు, ట్రాన్స్‌కో, డిస్కంలకు రూ.16,410 కోట్లు, మొత్తం హైదరాబాద్ అభివృద్ధికి రూ.10 వేల కోట్లు మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుకు రూ.1500 కోట్లు కేటాయించారు. బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేసింది. మొత్తం రూ.72,659 కోట్లను రైతాంగానికి కేటాయించింది. రైతు రుణమాఫీ, రైతు భరోసా పథకాలకు ఆ నిధులను వినియోగించనుంది. అదే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యానవన పంటలు, ఆధునిక వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. ఇప్పటికే రుణమాఫీ తొలివిడతలో లక్ష వరకు రుణాలు ఉన్న అన్నదాతల అకౌంట్లలో నగదు జమ చేసిన ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆగస్టు 15లోపు 2 లక్షల మేర రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేస్తామని స్పష్టం చేసింది. అలాగే తాము ఇస్తానన్న 15 వేల రైతు భరోసా పథకాన్ని అమలు చేసే విధంగా ప్రభుత్వం బడ్జెట్ కేటాయించింది. ఈ పథకానికి మార్గదర్శకాలు ఎలా ఉండాలనేది ఈ బడ్జెట్ సమావేశాల్లోనే.. చర్చించి తుది నిర్ణయం తీసుకుని అమలు చేస్తామని ప్రభుత్వం పేర్కొంది. రాష్ట్రంలో చివరి రైతు వరకు సంక్షేమ ఫలాలు అందలనేదే సర్కార్ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ఆర్థిక భద్రత కరువై పని దొరకని రోజుల్లో రైతు కూలీలు పస్తులుండాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పట్టాలు ఉన్న రైతులకే భరోసా నిచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టాలు లేని పేద రైతులను గాలికొదిలేసింది. వారందరినీ దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం కొత్త పథకానికి శ్రీకారం చుట్టబోతోంది. రైతు కూలీల ఆర్థిక, జీవన స్థితిగతులు మెరుగుపరిచేందుకు రాష్ట్ర వ్యాప్తంగా భూమిలేని రైతు కూలీలకు సంవత్సరానికి రూ.12 వేలు అందిచనున్నట్లు పేర్కొంది. ఈ పథకానికి కూడా ఈ సంవత్సరంలోనే శ్రీకారం చుట్టుబోతున్నట్లుగా మంత్రి ప్రకటించారు. అయితే దేశ చరిత్రలో భూమి లేని పేద రైతులకు నగదు పంపిణీ చేయడం ఇదే తొలిసారి కావడం విశేషం. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అప్పులు పది రెట్లు పెరిగాయి తప్ప తెలంగాణ ఆకాంక్షలు తీరలేదని బడ్జెట్ సమర్పణ సందర్భంగా ఆర్థికమంత్రి ప్రకటించారు. బంగారు తెలంగాణ చేస్తామని అప్పుల తెలంగాణను మిగిల్చారని ఆరోపించారు. కోట్లాది ప్రజల ఆశల మేరకు ఉద్యోగాలు, నీళ్లు దక్కకపోగా ఒంటెద్దు పోకడలతో ఆర్థిక వ్యవస్థను నిర్వీర్యం చేశారని, అప్పుల పెరగడంతో పాటు బిల్లుల బకాయిలు భారీగా పెరిగాయని మంత్రి తెలిపారు. కొత్త ఉద్యోగాలు సృష్టించడానికి బదులు ఉన్న ఉద్యోగాలను కూడా ఇవ్వలేదని, జీతాలు పెన్షన్ చెల్లింపులు సైతం చేయలేని దుస్థితి ఏర్పడిందని ఆర్థిక మంత్రి తెలిపారు. ఈ పరిస్థితుల్లో పదేళ్ల తర్వాత వాస్తవిక బడ్జెట్ ప్రవేశపెట్టామని మంత్రి చెప్పుకొచ్చారు. అయితే ఆరు గ్యారెంటీల అమలు విషయంలోనే మల్లగుల్లాలు పడుతున్న ప్రభుత్వం వాటితోపాటు ప్రకటించిన భారీ స్థాయి నజరాలను ఎలా చెల్లిస్తుందనేదే అసలు సమస్య. కేంద్ర సహాయంపై ఆశలు కూడా ఆవిరవుతున్న వేళ.. కాంగ్రెస్ ప్రభుత్వ తొలి బడ్జెట్ సాహసోపేతమైన ప్రకటన అనే చెప్పాల్సి ఉంటుంది. కొత్త రేషన్ కార్డుల పంపిణీ, ఆసరా పెన్షన్ల పెంపు, విద్యా భరోసా కార్డు, జాబ్ క్యాలెండర్ వంటి గుదిబండలను దాటుకుని రాష్ట్ర ప్రభుత్వం తన హామీలన్నింటినీ క్రమంగా నెరవేరుస్తుందని ఆశిద్దాం.

# అనితర సాధ్యాలు సంగం లక్ష్మీబాయి సేవలు...



తెలంగాణ సాయుధ పోరాటంతో పాటు స్వాతంత్ర్య సంగ్రామంలో మహిళలను ముందుండి నడిపించిన ధీర వనిత ఆమె. బాలికల, స్త్రీల సంక్షేమం కోసం నిరంతరం తపించి, జీవితాంతం చిత్తశుద్ధితో పాటుపడిన సేవా నిరతికి ప్రతిరూపం ఆమె. స్వాతంత్ర్య సమర యోధురాలుగా తామ్రపత్ర గ్రహీత ఆమె. శాసన సభ్యురాలిగా, విద్యా మంత్రిణిగా, ఆంధ్రప్రదేశ్ సామాజిక, సంక్షేమ సలహా బోర్డు కోశాధికారిణిగా, హైదరాబాద్ ప్రదేశ్ కాంగ్రెస్ మహిళా విభాగం కన్వీనర్‌గా, ఆంధ్ర మహిళా సభ సభ్యురాలిగా, అంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ బాధ్యు రాలిగా సమర్థ వంతంగా పనిచేసి, ప్రశంసలు అందుకున్న బహుముఖ ప్రజ్ఞాశాలి ఆమె. ఆమే ఆంధ్రప్రదేశ్ నుండి లోక్‌సభ సభ్యురాలైన తొలి మహిళగా గుర్తింపు పొందిన సంగం లక్ష్మీబాయి. సంగం లక్ష్మీబాయి(జూలై 27, 1911 - జూన్ 3, 1979) 1911, జూలై 27 న ఘటకేసర్ సమీపం లోని ఒక కుగ్రామంలో జన్మించారు. బాల్యం లోనే తల్లిదండ్రులు, చిన్నతనం లోనే వివాహమై భర్త చని పోవడంతో ఆమె అనాథ అయ్యారు. చాలా చురుకైన బాలిక కావడంతో మద్రాసు ఆంధ్ర మహిళా సభలో చదువుకునే అవకాశం లభ్యమైంది. కార్వే విశ్వ విద్యాలయం, ఉన్నవ లక్ష్మీ బాయమ్మ ప్రారంభించిన శారదా నికేతన్, మద్రాసు ఆర్ట్స్ కళాశాలలో చదువు కున్నారు. అక్కడ ఉన్నత చదువుల అనంతరం తిరిగి హైదరాబాద్‌కు చేరుకున్నారు. నారాయణ గూడలో ఉన్న రాజా బహదూర్ వెంకట్రామిరెడ్డి ఉమెన్స్ కాలేజ్ హాస్టల్ బాధ్యతలు చూసు కుంటూనే మరోవైపు స్వాతంత్ర్యో ద్యమంలో కీలకపాత్ర పోషించారు. ఎంతోమంది మహిళలను ఉద్యమాల్లో భాగస్వాములను చేశారు.ఆమె సాంఘిక సేవలోనే పూర్తి సమయం వెచ్చించి ఆ తర్వాత రాజకీయాలలో చేరారు. ఆమె విద్యార్థిగా ఉన్న రోజులలో సైమన్ కమీషన్ ను వ్యతిరేకించారు. ఉప్పు సత్యాగ్రహం (1930-31) లో క్రియాశీలంగా పాల్గొని ఒక సంవత్సరం జైలు శిక్ష అనుభవించారు. స్వామి రామానందతీర్థ ఆధ్వర్యంలో సాగిన నిజాం వ్యతిరేక ఉద్యమంలో ముఖ్య పాత్ర వహించారు. 1932లో శాసనోల్లంఘనలో పాల్గొని అరెస్ట్ అయి రాయవెల్లూరు జైలులో శిక్ష అనుభవించారు. ఆమె వినోభా భావే యొక్క తొలి పాద యాత్రకు తెలంగాణలో సారథ్యం వహించారు. 1950లో భూదానో ద్యమ యాత్ర కోసం తెలంగాణకు వచ్చిన ఆచార్య వినోబా బావే ఉపన్యాసాలను తెలుగులోకి అనువదించారు. ఆయన సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు 16 గ్రామాలు తిరిగి 314 ఎకరాల భూమిని సేకరించారు. 1947-48లో తెలంగాణ విమోచనో ద్యమం లోనూ పాల్గొన్నారు. విమోచన అనంతరం సేవా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఆమె 1952 లో నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గం నుంచి హైదరాబాదు రాష్ట్ర శాసనసభకు ఎన్నికయ్యారు. బూర్గుల రామకృష్ణారావు కేబినెట్‌లో విద్యాశాఖ సహాయ మంత్రిగా 1954 నుంచి 1956 వరకు బాధ్యతలు నిర్వర్తించారు. ఆమె హయాంలోనే తెలంగాణ జిల్లాల్లో బాలికల కోసం ప్రత్యేకంగా ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలు ప్రారంభమయ్యాయి. మంత్రిగా సంపాదన మొత్తాన్ని స్త్రీ సేవాసదన్‌కు ఉపయోగించారు. 1955లో దాన్ని తన సహచరులైన కేవీ రంగారెడ్డి, ఎ.శ్యామలాదేవి, పి.లలితాదేవి, పాశం పాపయ్య, ఎం.భోజ్‌రెడ్డితో కలిసి ఇందిరా సేవా సదన్‌గా రిజిస్టర్ చేయించారు. తద్వారా అనాథ మహిళలు, శిశువులకు ఉచిత విద్యనందించారు. సంతోష్ నగర్ చౌరస్తాలో ప్రస్తుతం ఐ.ఎస్.సదన్ గా పిలవబడుతున్న ప్రాంతంలో ఆమెకు రెండెకరాల స్థలంలో ఇల్లుండేది. తమ సొంత ఇంటిలోనే అనాథ శరణాలయాన్ని ప్రారంభించారు. అదే కాకుండా రాధికా మెటర్నిటీ హోమ్, వసు శిశువిహార్, మాశెట్టి హనుమంతు గుప్తా బాలికల ఉన్నత పాఠశాలల యొక్క స్థాపనలో ఆమె పాత్రలు మరిచి పోలేనివి.లక్ష్మీబాయి సేవల గురించి తెలుసుకున్న నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ స్వయంగా వచ్చి సాయం చేశారు. నాటి డిప్యూటీ సీఎం కొండా వెంకట రంగారెడ్డితో పాటు ఇందిరా గాంధీ కూడా సేవా సదనం నిర్వహణకు తోడ్పాటు అందించారు. 1957లో మెదక్ నియోజక వర్గం నుండి 2వ లోకసభకు ఎన్నిక య్యారు. 1962 లో 3వ లోకసభకు ఎన్నికయ్యారు. మూడవ సారి 1967లో 4వ లోకసభకు వరుసగా మెదక్ లోకసభ నియోజకవర్గం నుండి ఎన్నికయ్యారు. హైదరాబాదు యాదవ మహాజన సమాజం అధ్యక్షురాలిగా, అఖిల భారత విద్యార్థి సంఘం ఉపాధ్యక్షు రాలిగా, హైదరాబాదు ఫుడ్ కౌన్సిల్, ఆంధ్ర యువతి మండలి అధ్యక్షురాలిగా పని చేశారు. ఆంధ్రప్రదేశ్ సామాజిక సంక్షేమ సలహా బోర్డుకు కోశాధికారిణిగా, హైదరాబాదు ప్రదేశ్ కాంగ్రెస్ మహిళా విభాగ కన్వీనరుగా ఉన్నారు.

# దేశాభివృద్ధిలో రేడియో పాత్ర.....!




ప్రస్తుత కాలంలో ఇంటిలో ఇప్పుడు టివి ఉన్నట్లే కొంత కాలం క్రితం ప్రతి ఇంటిలో రేడియో సెట్ ఉండేది. రేడియో ద్వారానే నాడు నిత్య ప్రాపంచిక విషయాలు ప్రజలకు చేరేవి. సమయ సారిణిని క్రమంగా వివిధ కార్యక్రమాలు ప్రసారం జరిగేవి. నాడు ప్రధాన మనో రంజన సాధనాల్లో రేడియో ప్రధాన మైనది. జూన్ 1923 లో భారత దేశంలో ప్రసారం ప్రారంభమైనా, 1927 జూలై 23న తొలి సారిగా బొంబాయి రేడియో స్టేషన్ ప్రారంభం అయింది. బాంబే ప్రెసిడెన్సీ రేడియో క్లబ్, ఇతర రేడియో క్లబ్‌ల కార్యక్రమాలతో బ్రిటిష్ రాజ్ సమయంలో 1927 జూలై 23 న జరిగిన ఒక ఒప్పందం ప్రకారం, ప్రైవేట్ ఇండియన్ బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీ లిమిటెడ్ (ఐబిసి) రెండు రేడియో స్టేషన్లను నిర్వహించడానికి అధికారం ఇచ్చింది. అలా 1927 జూలై 23 న బొంబాయి స్టేషన్ ప్రారంభం అయి తద్వారా ప్రసారాలు ప్రారంభం అయినాయి. తర్వాత కలకత్తా స్టేషన్ 1927 ఆగస్టు 26 న ప్రారంభమైంది. రేడియో అనేది విద్య స్థాయి, సామాజిక, ఆర్థిక స్థితి, లింగం వయస్సుతో సంబంధం లేకుండా ప్రపంచ వ్యాప్తంగా చాలా మందికి చేరే మాస్ మీడియా. కాంతి వేగ పౌనఃపున్యాలతో విద్యుత్ అయస్కాంత తరంగాలను మాడ్యులేషన్ చేయటం ద్వారా తీగల ఆధారము లేకుండా గాలిలో శబ్ద సంకేతాలను ప్రసారం చేయు ప్రక్రియను దూర శ్రవణ ప్రక్రియ అంటారు. ఇలాంటి ప్రసారాలను వినటానికి ఉపయోగించే సాధనాన్ని రేడియో అంటారు. తొలి రోజులలో వాల్వులను ఉపయోగించి, రేడియోలను తయారు చేసేవారు. అవి ఎక్కువ విద్యుత్‌ను వాడేవి, పరిమాణంలో కూడా చాలా పెద్దవిగా ఉండేవి.

ఒక చోట మాత్రమే ఉంచి వినవలసి వచ్చేది. 1960లు వచ్చేటప్పటికి, ట్రాన్సిస్టరు కనిపెట్టబడి, ఆ ట్రాన్సిస్టర్ లను వాడిన రేడియోలు వాడకంలోకి వచ్చాయి. వీటిని ట్రాన్‌సిస్టర్ రేడియోలు అని పిలిచే వారు. ఇవి విద్యుత్‌ను చాలా తక్కువగా వాడుకుని, అలాగే ఘటము (బ్యాటరీ)తో కూడా పని చేయగలవు. సాంకేతిక పరిజ్ఞానం పెరిగి, ఈ ట్రాన్సిస్టర్ సాంకేతిక నైపుణ్యం అభివృద్ధి చెంది, రేడియోలు పరిమాణంలో చిన్నవి, అతి చిన్నవిగా మారి పోయాయి. జేబులో పట్టే రేడియోలు కూడా వచ్చాయి. ప్రస్తుతం మార్కెట్లోకి విడుదలవుతున్న ప్రతీ కంపెనీ మొబైల్స్ లోనూ రేడియో అప్లికేషను తప్పనిసరి అయి పోయింది. సమాచారాల చేర వేత కోసం గతంలో చాలామంది చేసిన ప్రయోగాలన్నీ సమకూర్చుకుని మార్కోనీ విస్తృత పరిశోధనలు చేశాడు. వైర్ లెస్ విధానం ద్వారా తొలి సంకేతాన్ని ప్రసారం చేసిన గొప్పతనం మార్కోనీ కే దక్కింది. మార్కొనీ క్రమంగా సంకేతాలు వెళ్ళగలిగే దూరాన్ని పెంచుతూ పోయాడు. క్రమంగా సంకేతాలను ఎక్కువ దూరం ప్రసరించేలా చేయడంలో మార్కోనీ కృతకృత్యు డయ్యాడు. 1898 వేసవిలో సముద్ర మధ్యంలో జరిగిన పడవ పందేల గురించి ఎప్పటికప్పుడు వార్తలు పంపడానికి డబ్లిన్ వార్తా పత్రిక మార్కోనీని నియమించింది. ఆయన సముద్ర తీరంలో గ్రాహకాన్ని అమర్చి, వైర్ లెస్ ప్రసారిణిని ఓ పడవలో ఉంచుకొని, అక్కడి నుంచి వార్తా పత్రిక కార్యాలయానికి టెలిఫోన్ ద్వారా చేర వేశారు. వైర్ లెస్ ద్వారా పంపబడిన మొట్టమొదటి పత్రికా వార్త ఇదే.

మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో సముద్ర తీరం నుంచి 30 మైళ్ల దూరంలో ఉండే యుద్ధనౌకకు వైర్ లెస్ ద్వారా మార్కోనీ సందేశం పంపించ గలిగాడు. లిస్బన్ వద్ద సముద్ర తీరంలో వైర్ లెస్ పరికరాల్ని అమర్చి 300 మైళ్ళ దూరం దాకా సంభాషణల్ని ప్రసారం చేయగలిగాడు. కొన్ని నెలల లోపే ప్రపంచంలో కెల్లా తొలి ప్రసార కేంద్రం పిట్స్ బర్గ్ లో స్థాపించ బడింది. అమెరికా అధ్యక్షుడిగా హార్డింగ్ ఎన్నికయ్యాడన్న వార్తను తొలి ప్రసారంలో ప్రకటించటంతో 1920 నవంబరు 2 వ తేదీన కార్యక్రమాలు ప్రారంభ మైనాయి. 1922 మే నెలలో 100 వాట్ల సామర్థ్యం గల రేడియో ప్రసార కేంద్రాన్ని లండనులో స్థాపించారు.1922 నవంబరులో బ్రిటనులో ప్రసార హక్కులు గల ఏకైక సంస్థ బి.బి. సి. నవంబరు 14 నుంచి లండను కేంద్రం రోజువారీ ప్రసారాలు ప్రారంభించింది. అమెరికా బెల్ టెలిఫోన్ ప్రయోగ శాలల్లో పనిచేసే పరిశోధక బృందం తొలి ట్రాన్సిస్టర్ 1948 లో తయారీ జరిగింది. బ్రిటిష్ రాజ్ సమయంలో జూన్ 1923 లో భారత దేశంలో ప్రసారం ప్రారంభమైంది. 1927 జూలై 23 న జరిగిన ఒక ఒప్పందం ప్రకారం, ప్రైవేట్ ఇండియన్ బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీ లిమిటెడ్ (ఐబిసి) రెండు రేడియో స్టేషన్లను నిర్వహించడానికి అధికారం ఇచ్చింది: 1927 జూలై 23 న బొంబాయి స్టేషన్, కలకత్తా స్టేషన్ 1927 ఆగస్టు 26 న ప్రారంభ మైనాయి. 1930 మార్చి 1 న కంపెనీ పరిసమాప్తిలోకి వెళ్లింది. ప్రభుత్వం ప్రసార సదుపాయాలను స్వాధీనం చేసుకుంది, 1930 ఏప్రిల్ 1 న రెండు సంవత్సరాల పాటు ప్రయోగాత్మక ప్రాతిపదికన ఇండియన్ స్టేట్ బ్రాడ్కాస్టింగ్ సర్వీస్ ను ప్రారంభించింది. 1936 జూన్ 8 న ఆల్ ఇండియా రేడియోగా మారింది.

ఆకాశవాణి ప్రపంచములోని అతిపెద్ద రేడియో ప్రసార వ్యవస్థలలో ఒకటి. దీని ప్రధాన కార్యాలయము కొత్త ఢిల్లీ లోని పార్లమెంటు వీధిలో భారత పార్లమెంటు ప్రక్కనే ఉన్న ఆకాశవాణి భవన్ లో ఉంది. ఆలిండియా రేడియో ప్రభుత్వ ఆధికారిక రేడియో ప్రసార సంస్థ. ఇది భారత ప్రభుత్వ సమాచార, ప్రసార యంత్రాంగ ఆధ్వర్యములో స్వయం ప్రతిపత్తి కలిగిన ప్రసార భారతి యొక్క విభాగము. దూరదర్శన్ కూడా ప్రసార భారతిలో భాగమే. దేశాభివృద్ధిలో ప్రభుత్వాధీంలో ఉన్న రేడియో, అన్ని రంగాలలోను సమాచారాన్ని ఇస్తూ దేశ సమగ్రతకూ, అభివృద్ధికి ఎంతగానో ఉపయోగ పడుతోంది. ఆల్ ఇండియా రేడియో సేవలు దేశ వ్యాప్తంగా 420 స్టేషన్లను కలిగి, దేశ విస్తీర్ణంలో దాదాపు 92%, మొత్తం జనాభాలో 99.19%కి చేరు కుంటున్నది. 23 భాషలలో, 179 మాండలికాలలో ప్రసారాలు జరుగు తున్నాయి. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చేసరికి 6 ఆకాశవాణి కేంద్రాలు (కలకత్తా, ఢిల్లీ, బొంబాయి, మద్రాసు, లక్నో, తిరుచిరాపల్లి) మాత్రమే ఉన్నాయి. ఇప్పుడు 215 అకాశవాణి కేంద్రాలు 337 ప్రసార కేంద్రాల (144 %వీఔ% కేంద్రాలు, 54 %ూఔ% కేంద్రాలు, 139 ఎఫ్ఎం కేంద్రాలు)తో 77 ఆకాశవాణి కేంద్రాలు 99.13% ప్రజలకు ప్రస్తుతం ప్రజలకు సమాచారాన్ని, విజ్ఞానాన్ని, వినోదాన్ని అందిస్తున్నాయి.ఆకాశవాణి తొలి తెలుగు ప్రసారాలు 1938 జూన్ 16న ప్రారంభమయ్యాయి. ఆరోజు సాయంత్రం 5.30గంటలకు సౌరాష్ట్ర రాగంలో త్యాగరాజ స్వామి రచించిన శ్రీ గణపతిని సేవింపరాదే అనే తెలుగు కృతిని తిరువెన్కాడు సుబ్రహ్మణ్యపిళ్లై నాదస్వరంపై వాయిస్తూండగా అదే తొలి ప్రసారంగా మద్రాసు కేంద్రం ప్రారంభమైంది. ఆ రాత్రే 8.15కు భారతదేశం - రేడియో అంశంపై ఆనాటి ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ప్రధాని సర్ కూర్మా వెంకటరెడ్డి నాయుడు తెలుగులో ప్రసంగించారు. మద్రాసు కేంద్రం తొలి తెలుగు ప్రసంగాల్లో 1938 జూన్ 18న సజీవమైన తెలుగు అనే అంశంపై గిడుగు రామమూర్తి పంతులు, జూన్ 21న మన ఇల్లు - దాని అందము చందము అనే అంశంపై కోలవెన్ను రామకోటేశ్వరరావు, జూన్ 23న రవీంద్రుని గురించి బెజవాడ గోపాలరెడ్డి 15నిమిషాల వ్యవధి గల ప్రసంగాలు చేశారు.


## బుసలు కొడుతున్న శ్వేతనాగు..

బాలీవుడ్ యువ సంచలనం మౌనీరాయ్ ఇన్ స్టా యాక్టివిటీ గురించి చెప్పాల్సిన పనిలేదు. మునుపటి కంటే మరింత ఉత్సాహంగా ఇన్ స్టాలో దూకుడు ప్రదర్శిస్తుంది. డిజైనర్ దుస్తుల్లో తనదమైన మార్క్ బ్యూటీని హైలైట్ చేస్తూహాట్ టాపిక్ అవుతుంది. తాజాగా అమ్మడు చీరందంలో బుసలు కొడుతోన్న వైనం నెట్టింట చర్చకు దారి తీసింది. ఇదిగో ఇక్కడిలా నల్ల చీరపై పువ్వు డిజైన్ చీరను ధరించి అమ్మడు వివిధ భంగిమల్లో కెమారాకి ఫోజులిచ్చింది. చీరను మ్యాచ్ చేస్తూ షోల్డర్ లెస్ బ్లౌజు ధరించింది. టాప్ టూ బాటమ్ నలుపు అందం ఒక ఎత్తైతే?.. అదే కొలతల్లో అమ్మడు పాల నురుగల సౌందర్య అంతకు మించి హైలైట్. మరోవైపు అమ్మడి నాభి అందాన్ని అంతకు మించి ఎక్స్ ఫోజ్ చేసింది. నల్లని కురుల కొప్పులో తెల్లని గులాబీ మరో ఆకర్షణ. మొత్తంగా బ్లాక్ అండ్ వైట్ కాంబినేషన్ లో నాగినీ బుసలు తీరు మాత్రం సంథింగ్ స్పెషల్. మౌనీరాయ్ బ్యూటీకి యువత ఫిదా అవుతుంది. చీరందంలో నాగిని అందానికి సాటెవ్వరూ అనిపిస్తుంది. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది.



## యుఎస్‌లో 'దేవర' ప్రీ సేల్స్ జోరు

మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ టైటిల్ పాత్రలో నటిస్తోన్న భారీ బడ్జెట్ పాన్ ఇండియా మూవీ 'దేవర'. కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రం అనేక సంచలనాలను సృష్టిస్తోంది. అభిమానులు సహా అందరూ ఎంతో ఆతృతగా ఈ సినిమా కోసం ఎదురు చూస్తున్నారు. ఈ మధ్య విడుదలైన ఫియర్ సాంగ్, చుట్టమల్లే.., దావుడి సాంగ్స్‌కు, టీజర్ కు వచ్చిన స్పందనతో సినిమాపై ఉన్న అంచనాలు నెక్ట్స్ లెవల్‌కు చేరుకున్నాయి. ఓవర్సీస్‌లో 'దేవర' అంచనాలు భారీగానే ఉన్నాయి. ఈ చిత్రాన్ని ప్రత్యాంగిర సినిమాస్ అమెరికాలోనే ఎప్పుడు ఎవరూ చేయనంత గొప్పగా రిలీజ్ చేయటానికి సన్నాహాలు చేస్తోంది. ఇటీవల ప్రీ బుకింగ్స్‌ను యుఎస్‌లో ఓపెన్ చేయగా అక్కడ ఇప్పటికే ప్రీ సేల్స్ ఐదు లక్షల డాలర్స్‌ను దాటేయటం విశేషం. సినిమాపై ఉన్న బజ్, ఊపు చూస్తుంటే ఇంకా ఈ లెక్క రోజు రోజుకీ పెరుగుతోందే కానీ తగ్గటం లేదు. ఆడియెన్స్ ఎప్పుడెప్పుడు ఈ సినిమాటిక్ ఫీల్‌ను తెరపై ఎంజాయ్ చేద్దామా అని ఎదురుచూస్తున్నారు. అభిమానులు టికెట్స్ కోసం



ఎగబడుతున్న తీరు చూస్తుంటే 'దేవర' బాక్సాఫీస్ దగ్గర జోరు చూపించనుందని తెలుస్తోంది. ఈ అమేజింగ్ సినిమాటిక్ ఎక్స్ హై యాక్షన్ థ్రిల్లర్‌ను రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్నారు. మొదటి భాగం 'దేవర: పార్ట్1'ను తెలుగు, తమిళ, హిందీ, మలయాళ, కన్నడ భాషల్లో ఈనెల 27న విడుదల చేస్తున్నారు. 'దేవర'గా టైటిల్ పాత్రలో ఎన్టీఆర్ నటిస్తోన్న ఈ చిత్రంలో జాన్వీ కపూర్, ప్రకాష్ రాజ్, శ్రీకాంత్ , షైన్ టామ్ చాకో, నరైన్ కీలక పాత్రలను పోషించారు. నందమూరి కళ్యాణ్ రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆరట్స్, యువ సుధ ఆర్ట్స్ పతాకాలపై మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ.కె ఈ సినిమాను నిర్మిస్తున్నారు.




## 'గేమ్ ఛేంజర్' లేటెస్ట్ అప్‌డేట్

శంకర్ దర్శకత్వంలో గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న 'గేమ్ ఛేంజర్' సినిమా నుంచి అప్‌డేట్ వచ్చింది. వినాయక చవితి పండుగ సందర్భంగా ఈ సినిమా సెకండ్ సింగిల్ ను ఈ నెలలోనే విడుదల చేస్తామని చెప్పారు. ఈ మేరకు ఓ పోస్టర్ ను రిలీజ్ చేశారు మేకర్స్. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన 'జరగండి' సాంగ్ అందరినీ అలరించింది. సెకండ్ సింగిల్‌ను కూడా అదే స్థాయిలో ప్లాన్ చేశారు. ఈ సినిమాలో బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ హీరోయిన్ గా నటిస్తోండగా.. ఈ సినిమాకి తమన్ సంగీతం అందిస్తున్నాడు. కాగా, ఈ ఏడాది క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 20న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటన వెలువడింది.

## ఎట్టకేలకు ఎమర్జెన్సీ సెన్సార్ పూర్తి

బాలీవుడ్ నటి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన 'ఎమర్జెన్సీ' సినిమా సెన్సార్ ఎట్టకేలకు పూర్తయ్యింది. ఈ సినిమాకు సెన్సార్ బోర్డ్ యూ/ఏ సర్టిఫికెట్ జారీ చేసింది. అయితే సెన్సార్ బోర్డు సినిమాలోని పలు సన్నివేశాల విషయంలో అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆయా సీన్స్‌ను తొలగించడమో లేదా వాటి స్థానంలో కొత్తవి యాడ్ చేయాలని మూవీ యూనిట్?కు సూచించింది. భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ రాజకీయ జీవితం ఆధారంగా ఈ సినిమా తెరకెక్కింది.

1975నాటి ఎమర్జెన్సీ పరిస్థితులను ఈ సినిమాలో చూపించనున్నారు. ఈ సినిమాలో కంగన ఇందిరాగాంధీ పాత్రలో కనిపించనుండగా, బాలీవుడ్ స్టార్ నటులు అనుపమ్ ఖేర్, శ్రేయస్ తల్పడే కనిపించనున్నారు. సెప్టెంబర్ 6న మూవీ రిలీజ్ కావాల్సి ఉండగా, సెన్సార్ సర్టిఫికేట్ విషయంలో ఆలస్యం అవ్వడం వల్ల వాయిదా పడింది.

